సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం : 12 : నవంబర్ : 2022



సీఎం జగన్‌కు ఘన స్వాగతం

సాక్షి, విశాఖపట్నం: రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం సాయంత్రం విశాఖ చేరుకున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఆయనకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి సత్యవతి, గొడ్డేటి మాధవి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

వేదికపై నలుగురు..

- ప్రధాని, సీఎం, గవర్నర్‌తో పాటు కేంద్రమంత్రికి చోటు
- ఉదయం 10.15 గంటలకు వేదిక వద్దకు ప్రధాని, ముఖ్యమంత్రి
- ముందుగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రసంగం
- 7 నిమిషాల పాటు ప్రసంగించనున్న సీఎం వైఎస్ జగన్
- అనంతరం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న మోదీ
- 40 నిమిషాల పాటు ప్రజలనుద్దేశించి మాట్లాడనున్న ప్రధానమంత్రి



ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ప్రధాన వేదిక

సాక్షి, విశాఖపట్నం: మరికొద్ది గంటల్లో మహోజ్వల ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా రూ.10,742 కోట్ల విలువైన ఏడు కీలక ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు విశాఖ వేదికగా నిలవనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకే వేదికపై నుంచి బృహత్తర కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఏయూ మైదానం వేదికగా జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ, సీఎం వైఎస్ జగన్, గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇప్పటికే విశాఖ చేరుకున్నారు.

ప్రధానికి ఆత్మీయ స్వాగతం

ఇంధన తయారీ, వినియోగంలో స్వయం సమృద్ధి, మెరుగైన రోడ్లు, రైలు మార్గాలు, మత్స్యకారుల ఆర్థిక శ్రేయస్సే లక్ష్యంగా విశాఖలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభా కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రధాని మోదీ శుక్రవారం రాత్రి 7.55 గంటలకు నగరానికి చేరుకున్నారు. అంతకుముందే విశాఖకు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐఎన్‌ఎస్ డేగాలో ప్రధానికి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం శోభాయాత్ర పేరుతో నిర్వహించిన రోడ్‌షోలో ప్రధాని మోదీ ప్రజలకు అభివాదం చేస్తూ.. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలోని చోళా సూట్‌కు పయనమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టు గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. శనివారం ఉదయం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే భారీ బహిరంగ సభకు ఇరువురూ హాజరుకానున్నారు.

సభ సాగనుందిలా..

పోర్టు గెస్ట్ హౌస్ నుంచి బయలుదేరి 9.40 గంటలకు వేదిక వద్దకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు చోళ నుంచి బయలుదేరి 10.15కు ఏయూ గ్రౌండ్‌లో జరగనున్న బహిరంగ సభకు ప్రధాని మోదీ హాజరవుతారు. 10.20 గంటలకు వేదికపైకి చేరుకుంటారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సభాధ్యక్షత వహిస్తారు. రైల్వే మంత్రి ప్రసంగించిన తర్వాత.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 7 నిమిషాలపాటు ప్రసంగిస్తారు. అనంతరం 10 నిమిషాలపాటు ఏడు కీలక ప్రాజెక్టులను ప్రధాని మోదీ, సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించడంతోపాటు శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం పీఎం మోదీ 40 నిమిషాల పాటు ప్రసంగిస్తారు. 11.30 గంటలకు ప్రధాని, ముఖ్యమంత్రి ప్రజలకు వీడ్కోలు చెప్పి వేదిక నుంచి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ వేర్వేరు హెలికాప్టర్లలో ఐఎన్‌ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడ ప్రధాని మోదీకి సీఎం జగన్, గవర్నర్ ఆత్మీయ వీడ్కోలు పలకనున్నారు.

ప్రధాని, సీఎం, గవర్నర్, రైల్వే మంత్రి మాత్రమే..

భారీ బహిరంగ సభ వేదికపై నలుగురికి మాత్రమే చోటు దక్కింది. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాత్రమే వేదికపై ఆశీనులవుతారు. మరో వేదికపై కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ముఖ్య నాయకులు కలిపి 100 మందికి చోటు దక్కింది. ఇంకో వేదిక వద్ద కేంద్ర, రాష్ట్ర అధికారులు 60 మంది కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. వీఐపీ పాసులు 1,000 మందికి పైగా అందించారు. ఈ సభకు దాదాపు 2 లక్షల నుంచి 3 లక్షల మంది వరకు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.



భోజన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

అనంతరం మోదీ ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు, సీఎం జగన్, గవర్నర్ హరిచందన్ గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్తారు. ఇందుకు సంబంధించి పోలీసులు, భద్రతా బలగాల వారు హెలికాప్టర్ల ట్రయల్ రన్‌ను శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు.

ప్రజల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఇతర వీఐపీలే కాకుండా.. సభకు హాజరయ్యే ప్రజలు హాయిగా కూర్చునేలా వేదిక వద్ద ఏర్పాట్లు చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం, అధికారులు తగిన చర్యలు చేపట్టారు. ఎండ, వానల నుంచి ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ టెంట్లు వేశారు. ఉదయం 6 గంటల నుంచే వేదిక వద్దకు ప్రజలు చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో వారికి భోజన వసతి కల్పించేందుకు ప్రత్యేక వ్యవస్థను ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ మల్లికార్జున సిద్ధం చేశారు. మొత్తం ఏడు పాయింట్లలో భోజనాలు అందించనున్నారు. మరో 10 పాయింట్లలో అల్పాహారం సిద్ధంగా ఉంటుంది. ఉదయం 7 గంటల కల్లా.. ఆయా స్థానాల వద్దకు ఫుడ్ ప్యాకెట్స్ చేరుకునేలా డీఎస్‌వో సూర్యప్రకాశరావు నేతృత్వంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. 1651 బస్సుల్లో ప్రజలకు భోజనాలను అందించేందుకు 158 వాహనాలను సిద్ధం చేశారు. 158 మంది రూట్ ఆఫీసర్లు, 42 మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం వెజ్ బిర్యానీ, పచ్చడి, వాటర్ బాటిల్, స్వీట్‌ను శుభ్రమైన ప్యాకింగ్ చేసి ప్రజలకు అందించనున్నారు. సభ అనంతరం.. అక్కడే భోజనం చేసి బయలుదేరేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది పడకుండా జీవీఎంసీ అధికారులు పారిశుధ్య నిర్వహణ, మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు ఏర్పాటు చేశారు.





పీఎం నరేంద్ర మోదీకి అభివాదం చేస్తున్న అరకు, అనకాపల్లి ఎంపీలు మాధవి, సత్యవతి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ప్రధాని సభకు సర్వం సిద్ధం

- కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు
- సభకు 3 లక్షల మంది హాజరవుతారని అంచనా
- 6,700 మంది పోలీసులతో బందోబస్తు
- కేంద్ర బలగాలతో మూడంచెల భద్రతా వ్యవస్థ
- ఏర్పాట్లను పరిశీలించిన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



సభా ప్రాంగణం వద్ద అడుగడుగునా స్వాగత ద్వారాలు

దొండపర్తి (విశాఖ దక్షిణ): ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో సుందరంగా వేదిక ముస్తాబైంది. అతిథులు, ఆహ్వానితుల గ్యాలరీలను అద్భుతంగా తీర్చిదిద్దారు. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి శనివారం ఉదయం 7 అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రధాని సభకు విశాఖ నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు 3 లక్షల మంది ప్రజలు హాజరయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్లుగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సభకు వచ్చే ప్రముఖులతో పాటు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు వ్యూహంతో పకడ్బందీ చర్యలు చేపట్టారు.

భద్రతా వలయంలో ఏయూ ప్రాంగణం

ప్రధాని మోదీతోపాటు గవర్నర్ హరిచందన్, సీఎం జగన్‌తో పాటు ఇతర ప్రముఖులు బహిరంగ సభకు హాజరవుతుండడంతో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. విశాఖ నుంచే కాకుండా రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి సుమారు 32 మంది ఐపీఎస్ అధికారుల పర్యవేక్షణలో 6,700 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు కల్పించారు. ప్రధానంగా బహిరంగ సభ జరిగే ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాలను ప్రత్యేక రక్షణ దళాలు ఆధీనంలోకి తీసుకున్నాయి. ఆయా ప్రాంతాల్లోని ఇళ్లలో ఉన్న వారి వివరాలను కూడా ఆరా తీశారు. సభా ప్రాంగణంలో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో 600 మంది బాంబ్ డిస్పోజల్, స్నిఫర్ డాగ్ బృందాలు అణువణువూ తనిఖీ చేశాయి. శుక్రవారమే ప్రముఖులందరూ నగరానికి చేరుకోవడంతో వారు ప్రయాణించే రహదారుల్లో ప్రత్యేక రోప్ పార్టీల సాయంతో బందోబస్తు కల్పించారు. ఒకవైపు సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండానే.. మరోవైపు ప్రజాప్రతినిధులకు భద్రత చర్యలు చేపట్టారు. సభా ప్రాంగణం వద్ద అత్యవసర పరిస్థితుల నిమిత్తం 600 మంది స్పెషల్ ఫోర్సెస్ (గ్రేహౌండ్స్, ఏపీఎస్పీ, ఆక్టోపస్) సిబ్బందితో ఏరియా డామినేషన్, ఎమర్జెన్సీ, క్విక్ రియాక్షన్స్ బృందాలను అప్రమత్తంగా ఉంచారు. 160 మంది స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బంది మఫ్టీలో నిఘా పెట్టారు. 150 మంది కమ్యూనికేషన్ ఫోర్స్ సిద్ధం చేశారు. సభా ప్రాంగణం వద్ద కేంద్ర బలగాలతో మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన డీజీపీ

ప్రధాని, గవర్నర్, సీఎం పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ ఏయూలో సభ జరిగే ప్రాంగణం, హెలిప్యాడ్ వద్ద చేసిన భద్రతా చర్యలను డీజీపీకి వివరించారు. అక్కడ నుంచి డీజీపీ ఐఎన్‌ఎస్ డేగాకు వెళ్లి ప్రధాని రాత్రి బస చేసే చోళా సూట్ వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ట్రాఫిక్ మళ్లింపు

ప్రధాని, ఇతర ప్రముఖులు నగరానికి వచ్చిన నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రధాని సభ కారణంగా భారీ వాహనాలను నగరంలోకి రాకుండా అనకాపల్లి నుంచి వచ్చే వాహనాలను లంకెలపాలెం వైపు.. విజయనగరం నుంచి వచ్చే వాహనాలను ఆనందపురం కొత్త జాతీయ రహదారి మీదుగా మళ్లించారు. విమానాశ్రయం నుంచి ప్రజాప్రతినిధులు పర్యటించే ప్రాంతాల్లో కూడా స్వల్ప ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఒకవైపు 3,500 మంది లా అండ్ ఆర్డర్ పోలీసులతో నగరానికి వచ్చే వీఐపీల భద్రతా ఏర్పాట్లు చేస్తూనే.. మరోవైపు నగరవాసులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు 1400 మంది సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఇతర ప్రాంతాలు, జిల్లాల నుంచి బస్సులు, వ్యాన్‌లు, ఆటోల్లో ప్రజలు వచ్చే అవకాశం ఉండడంతో.. ఆ వాహనాల నిలుపుదల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యాలను కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సభా ప్రాంగణానికి సులువుగా చేరుకునే విధంగా రూట్‌మ్యాప్‌ను రూపొందించారు.



సభా ప్రాంగణం వద్ద పీఎం మోదీ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భారీ స్వాగత కటౌట్

ఏర్పాట్లు ఇలా..

- ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోని రెండు మైదానాల్లో బహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు. పైన ఉన్న మైదానంలో ప్రధాని, గవర్నర్, సీఎం, అతిథులు కూర్చునే విధంగా మూడు భారీ జర్మన్ టెంట్‌లతో వేదికను సిద్ధం చేశారు. రెండో మైదానంలో ప్రజల కోసం ఏసీలు, ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాట్లు చేశారు.
- ఏయూ ఇంజినీరింగ్ హాస్టల్స్, విద్య హాస్టల్ వెనుక, న్యాయ విద్యార్థుల హాస్టల్స్ మమత, సమత ఎదురుగా పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేశారు.
- వైఎస్ మూర్తి ఆడిటోరియం పక్కనే ఉన్న ఎగ్జిబిషన్ మైదానంలో మూడు హెలిప్యాడ్‌లను నిర్మించారు. అక్కడ నుంచి ప్రత్యేకంగా నిర్మించిన రహదారిలో ప్రధాని, ఇతర ప్రముఖులు సభా ప్రాంగణానికి చేరుకుంటారు.
- సభాప్రాంగణంలో ప్రధాన రహదారి, ఇరువైపులా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ముచ్చట గొలుపుతున్నాయి. తమిళనాడుకు చెందిన కార్మికులు మూడు రోజుల పాటు శ్రమించి వీటిని ఏర్పాటు చేశారు.
- సభా ప్రాంగణంలో ఎక్కడికక్కడ తాగునీటి సరఫరా కేంద్రాలు, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు.
- ఎంవీపీ కాలనీ, రామలక్ష్మీ అపార్టుమెంట్ కూడలి, పెదవాల్తేర్, చినవాల్తేర్ ప్రాంతాల్లోని పలు చోట్ల జీవీఎంసీ హెల్ప్ డెస్క్‌లను సిద్ధం చేసింది. ఇక్కడ సచివాలయాల కార్యదర్శులు సేవలు అందిస్తున్నారు.



సభా వేదిక లోపలికి వెళ్లడానికి ఏర్పాటు చేసిన మెటల్ డిటెక్టర్ ద్వారాలు

న్యూస్‌రీల్

జిల్లాస్థాయి పోటీలకు మారేడుమిల్లి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీలు

మారేడుమిల్లి: రంపచోడవరం డివిజన్ స్థాయిలో (ఎస్‌జీఎఫ్‌ఐ) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్వహించిన డివిజన్‌స్థాయి పోటీల్లో ఇక్కడి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మునురుమిల్లి ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాణించారు. సీనియర్స్ విభాగంలో వాలీబాల్, షాట్‌పుట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు, జూనియర్స్ విభాగం చదరంగం, క్యారమ్స్‌లో ప్రథమ స్థానాలను సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీ సుదర్శన్ తెలిపారు. వీరిని హెచ్‌ఎం రామారావు, డిప్యూటీ వార్డన్ చిన విష్ణుదొర అభినందించారు.

కూల్.. కూల్



సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది.

మినుములూరు	: 14
చింతపల్లిలో	: 14.8,
అరకులోయ	: 16 డిగ్రీలు

క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు : కలెక్టర్



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ సుమీత్‌కుమార్, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలోని శుక్రవారం జిల్లాస్థాయి క్రీడా పోటీల ఎంపిక కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయజెండాను ఆవిష్కరించారు. క్రీడాకారులను వారు పరిచయం చేసుకున్నారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో క్రీడాలపై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారన్నారు. జూనియర్ కళాశాల క్రీడామైదానం అభివృద్ధికి కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు. సర్పంచ్‌లు కొట్టగుల్లి ఉషారాణి, సీదరి రాంబాబు, వంతాల రాంబాబు, లకే పార్వతి, ఎంపీటీసీలు రామకృష్ణపాత్రుడు, నరసింహమూర్తి, చిట్టమ్మ పాల్గొన్నారు.

బాలోత్సవ్‌కు డీఏవీ విద్యార్థులు



విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మోతుగూడెం: మోతుగూడెం డీఏవీ పాఠశాల విద్యార్థులు ఈ నెల 12 నుంచి 14 వరకు గుంటూరులో జరిగే తెలుగు బాలల సాంస్కృతిక ఉత్సవాలు (బాలోత్సవ్)లో పాల్గొంటున్న డీఏవీ పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీజీఎస్ నాయుడు తెలిపారు. గుంటూరులో మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో తమ స్కూల్‌కు చెందిన 32 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. విద్యార్థులు వెళ్లేందుకు ఏపీ జెన్‌కో అధికారులు బస్సు సౌకర్యం కల్పించినట్టు ఆయన పేర్కొన్నారు. ఉత్సవాలకు వెళ్తున్న విద్యార్థులను ఏపీ జెన్‌కో ఇంచార్జ్ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, డీఈ బాలకృష్ణ, సివిల్ ఈఈ బాబురావు, యూనియన్ నాయకులు అభినందించారు.

పొలాలకు సోలార్ ఫెన్సింగ్

వ్యవసాయ సలహామండలి చైర్మన్ వెంకటరమణ



మాట్లాడుతున్న బొడ్డు వెంకటరమణ

రాజవొమ్మంగి: ఏజెన్సీలో కోతులు, అడవి జంతువుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు ప్రభుత్వం రాయితీపై రైతుల భూములకు సోలార్ ఫెన్సింగ్ మంజూరు చేయాలని వ్యవసాయ సలహామండలి చైర్మన్ బొడ్డు వెంకటరమణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సలహామండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. అష్టకష్టాలు పడి రైతులు పంటలు పండిస్తుంటే చేతికి వచ్చే సమయానికి వాటిని కోతులు, పశువులు, వన్యప్రాణులు దక్కకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి బారి నుంచి పంటలను కాపాడాలని కోరారు. ప్రభుత్వ ఏర్పాటుచేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పంటను విక్రయించాలని కోరారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి రమేష్ నాయుడు, మత్స్యశాఖ, వెటర్నరీ, హార్టికల్చర్ అసిస్టెంట్లు శివసాయి ఏసుబాబు, రామరాజు, వీఏఏలు శివ, రవి, భరత్, ప్రసాద్, కోటి తదితరులు పాల్గొన్నారు.

స్పందన వినతుల సత్వర పరిష్కారం

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- 118 అర్జీల స్వీకరణ



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: స్థానిక ఐటీడీఏలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు వినతులు వెల్లువెత్తాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలనుంచి 118 వినతులను కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. స్పందనకు వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పాడేరు మండలం మినుములూరు సర్పంచ్ లంకెల చిట్టమ్మకు రైస్ అండ్ ఫ్లోర్‌మిల్లు, హుకుంపేట మండలానికి చెందిన నిరోశ, భవానీలకు మిల్లెట్ ఫ్లోర్ మిల్ ఏర్పాటుకు మంజూరైన రుణ చెక్కులను కలెక్టర్ వారికి పంపిణీ చేశారు.

వినతుల్లో కొన్ని..

- ఆశా కార్యకర్తగా నియమించాలని పాడేరు మండలం వంజంగి గ్రామానికి చెందిన శాంతికుమారి కోరారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని హుకుంపేట మండలం కొట్నపల్లి పంచాయతీ సర్పంచ్ బొంజుబాబు వినతిపత్రం అందజేశారు.
- అటవీ భూములకు సర్వే నిర్వహించి పట్టాలు మంజూరుచేయాలని చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ గిరిజనులు కోరారు. రోడ్డు సౌకర్యం కల్పించాలని కొయ్యూరు మండలం నల్లిగెడ్డ గిరిజనులు అర్జీ అందజేశారు.
- కుళాయిలు ఏర్పాటుచేసి తాగునీరు అందజేయాలని పెదబయలు మండలం సీతగుంట గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు.



రుణాల చెక్కులను అందజేస్తున్న కలెక్టర్

అభ్యంతరాలుంటే తెలియజేయండి



ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్వామినాయుడు

చింతూరు: పోలవరం ముంపునకు గురవుతున్న గృహాలకు సంబంధించి వెలువడిన నోటిఫికేషన్లో ఎవరికైనా అభ్యంతరాలుంటే చింతూరులోని పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని చింతూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్వామినాయుడు అన్నారు. చింతూరులోని 1445 గృహాలకు సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ పరిహారం నిమిత్తం శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్డీసీ మాట్లాడుతూ గతంలో సర్వే చేసిన గృహాలను ఇటీవల విడుదలైన నోటిఫికేషన్లో నమోదు చేసినట్టు చెప్పారు. ఎటపాక యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, ఎంపీటీసీ సభ్యురాలు తుర్రం ముత్తమ్మ, సర్పంచ్ కారం కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

బాలింతకు తక్షణ వైద్యం

- బలవంతంగా ఆస్పత్రిలో చేర్పించిన వైద్యాధికారి
- రక్తం ఎక్కించడంతో మెరుగుపడిన ఆరోగ్య పరిస్థితి



బాలింతకు రక్తం ఎక్కిస్తున్న వైద్యులు

చింతపల్లిరూరల్: రక్తహీనతతో బాధపడుతున్న బాలింతను స్థానిక ఆస్పత్రిలో చేర్పించేందుకు వైద్యాధికారులు నానా ఇబ్బందులు పడ్డారు. బాలింతకు ఆధునిక వైద్యం అందించేందుకు ధారకొండ పీహెచ్‌సీ నుంచి అతికష్టం మీద వైద్యాధికారి డీకే హిమబిందు శుక్రవారం ఇక్కడికి తీసుకువచ్చారు. గూడెం కొత్తవీధి మండలం ధారకొండ పీహెచ్‌సీ పరిధిలోని గుమ్మిరేవులు గ్రామానికి చెందిన కె.తులసి అనే బాలింత రక్తహీనత కారణంగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతోంది. సమస్యను గుర్తించిన వైద్యాధికారి హిమబిందు మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ఏరియా ఆస్పత్రికి రావాలని సూచించారు. అందుకు ఆమె నిరాకరించింది. బలవంతంగా బాలింతను ఒప్పించి ఇక్కడి ఆస్పత్రికి శుక్రవారం అతికష్టంమీద తీసుకువచ్చారు. మరోసారి రక్త పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆదిత్య కీర్తి పర్యవేక్షణలో ఆమెకు యూనిట్ రక్తం ఎక్కించినట్టు వైద్యాధికారి రఘురాం తెలిపారు. దీంతో ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ఆయన తెలిపారు.

పీహెచ్‌సీల్లో మానసిక రోగులకు వైద్య సేవలు | II లో | మార్కెట్ యార్డుల అభివృద్ధికి చర్యలు | అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పాముకాటుతో ఇద్దరికి అస్వస్థత



చికిత్స పొందుతున్న బాలుడు

చింతపల్లి: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో శుక్రవారం జరిగిన పాముకాటు సంఘటనల్లో ఒక బాలుడు, మహిళ అస్వస్థతకు గురయ్యారు. వీరిని చింతపల్లి ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందిస్తున్నారు. బయలుకించంగి గ్రామానికి చెందిన నవీన్(9) అనే బాలుడు ఇంటి వరండాల్లో నిద్రిస్తుండగా పాము కాటేసింది. అలాగే పోతురాజుగున్నలకు చెందిన చిన్ని(30) మధ్యాహ్నం పంట పొలంలో పాము కాటుకు గురైంది. వీరిద్దరిని వారు కుటుంబ సభ్యులు చింతపల్లి ఆస్పత్రికి తరలించగా, వైద్య సేవలందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యాధికారి రఘురాం తెలిపారు.

ఏపీఆర్‌డీసీ సభ్యుడిగా సత్యనారాయణ



అడ్డతీగల: ఏపీ రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యుడిగా మండలంలోని రాయపల్లికి చెందిన బత్తుల చిన్న వెంకట సత్యనారాయణను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నియమించిన 14 మంది సభ్యుల్లో ఆయన ఒకరు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఏపీఆర్‌డీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

లైంగిక వేధింపుల ఆరోపణలపై చోడవరం ఎస్టీవో బదిలీ

సాక్షి ఎఫెక్ట్..

మహారాణిపేట (విశాఖ దక్షిణ): వైద్య ఆరోగ్యశాఖ మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న చోడవరం సబ్ ట్రెజరీ అధికారి (ఎస్టీవో) సిహెచ్.టి.రామారావుపై వేటు పడింది. ఆయనను అక్కడ నుంచి బదిలీ చేసి అల్లూరి సీతారామరాజు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ట్రెజరీ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. మోహనరావు ఉత్తర్వులు జారీ చేశారు. లంకవానిపాలెం పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగిని లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని ఎస్టీవోపై ఫిర్యాదు. గత నెల 19న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై విచారణకు ఆదేశించారు. అనకాపల్లి డీటీవో సుభాషిణి విచారణ చేసి నివేదిక పంపారు. దీని ఆధారంగా చర్య తీసుకున్నారు. చోడవరం ఇన్‌చార్జి ఎస్టీవోగా నియమితులైన ఏఎస్ఎన్ మూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారని డీటీవో సుభాషిణి 'సాక్షి'కి తెలిపారు.

లంపీ స్కిన్ వ్యాధిపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ అశ్వత్థామ



అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి లలిత

డుంబ్రిగుడ: దేశ వ్యాప్తంగా మూగ జీవులకు సోకుతున్న లంపీ స్కిన్ వ్యాధి లక్షణాలపై గిరిజన గ్రామాల్లో ఉన్న పాడి రైతులకు అవగాహన కల్పించి వ్యాధులు సోకకుండా ముందస్తు వ్యాక్సినేషన్లు వేసే కార్యక్రమాలు పశుసంవర్ధక సహాయకులు చేపట్టాలని పశుసంవర్ధక శాఖ ఏడీ అశ్వత్థామ అన్నారు. అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల పశుసంవర్ధక సహాయకులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇది వైరస్ ద్వారా సంక్రమించే వ్యాధి అని, పశువులకు త్వరగా సోకుతుందన్నారు. వ్యాధి సోకిన పశువుకు కళ్లు, ముక్కుల నుంచి నీరులా స్రావాలు కారడం, జ్వరం రావడం, శరీరంపై కణతలు, బొబ్బలు రావడం, పశువు తిండి మందగించడం వంటి లక్షణాలు కనబడతాయన్నారు. ఈవ్యాధి తీవ్రత 7 నుంచి 14 రోజులు ఉంటుందన్నారు.ఈ లక్షణాలు ఉన్న పశువుకు సకాలంలో వైద్యం చేయించకపోతే చనిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఆయా లక్షణాలను రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంత గ్రామాల్లో ఉన్న పశువులకు లంపీ స్కిన్ వ్యాక్సిన్ తప్పకుండా వేయాలని సిబ్బందిని సూచించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోండి

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం పశువులకు సోకే లంపీ స్కిన్ వ్యాధిపై డాక్టర్ లలిత ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పశువులకు సోకే లంపీ స్కిన్ వ్యాధిపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. లంపీ స్కిన్ వ్యాక్సినేషన్ సిద్ధంగా ఉందని, 90 వేల పశువులకు వ్యాక్సిన్ డోస్‌లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఇప్పటికి 6100 పశువులకు వ్యాకిన్ వేశామన్నారు. పశువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయాలని సూచించారు. సర్పంచ్ చిన్నమ్ములు, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, సచివాలయ వెటర్నరీ అసిస్టెంటు, సిబ్బంది, గ్రామ వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో మానసిక రోగులకు వైద్య సేవలు



మాట్లాడుతున్న సైక్రియాటిస్ట్ డాక్టర్ రామారెడ్డి, పక్కన పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీదుర్గ

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మానసిక రోగులకు సైక్రియాటిస్ట్ డాక్టర్ టి.రామారెడ్డి శుక్రవారం వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీల పరిధిలోని మానసిక రోగులను గుర్తించి, కౌన్సెలింగ్ అవసరమైన వారికి మందులు అందజేస్తున్నట్టు చెప్పారు. రాజవొమ్మంగి, గంగవరం, ఎల్లవరం, లాగరాయి పీహెచ్‌సీలకు నెలలో 2వ శుక్రవారం వస్తానన్నారు. ఈ విధంగా ఉమ్మడి జిల్లాల్లోని 40 పీహెచ్‌సీలలో నెలలో ఒక రోజు సేవలందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆయన ఏఎన్ఎం, ఆశలతో సమావేశమై, గ్రామాల్లో ఎవరైనా ప్రాథమిక స్థాయిలో (సబ్ క్లినికల్ కేసెస్) ఉంటే గుర్తించి తెలియజేయాలని సూచనలిచ్చారు. రోగులకు మరింత మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం, కాకినాడ తదితర ప్రాంతాలకు రిఫర్ చేసి చికిత్స అందజేస్తామన్నారు.ఆయనతో పాటు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీదుర్గ ఉన్నారు.

మార్కెట్ యార్డుల అభివృద్ధికి చర్యలు

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: మార్కెట్ యార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా మార్కెటింగ్ ఎడిషనల్ డైరెక్టర్ పి.రాకేష్‌తో పాటు సంబంధిత ఉద్యోగులతో సమావేశమయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వారపు సంతల్లో షెడ్ల ఏర్పాటుతో పాటు మార్కెట్ యార్డుల అభివృద్ధిపై దృష్టి సారిస్తే అధికారులు నిర్లక్ష్యం చూపిస్తున్నారన్నారు. అరకులోయ మార్కెట్ యార్డులో ఇప్పటివరకు పూర్తిస్థాయి ధరల పట్టిక కూడా ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూరగాయలు తదితర ధరలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కూరగాయలను కిలో లెక్కల చొప్పున కాకుండా పోగులతో విక్రయించి, అధిక ధరలు వసూలు చేస్తున్నారన్నారు. మార్కెట్ కమిటీ ప్రతినిధులు, అధికారుల సమన్వయం లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారుల పనితీరుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఏఎంసీ కార్యదర్శి జగన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తి సకుమార్, సర్పంచ్ దాసుబాబు, డైరెక్టర్ మజ్జి గురు, తదితరులున్నారు.

బుల్లెట్ ఢీ.. భార్యాభర్తలకు గాయాలు

కశింకోట: మండలంలోని బయ్యవరం వద్ద రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆదినారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. గురువారం సాయంత్రం గ్రామానికి చెందిన చిదిరెడ్డి సన్యాసినాయుడు, భార్య లచ్చమ్మ సమీపంలోని పొలానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నారు. జాతీయ రహదారి పక్కగా నడిచి వస్తుండగా, యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వేగంగా వస్తున్న బుల్లెట్ వెనుక నుంచి ఢీకొంది. ఇద్దరూ తీవ్రంగా గాయపడగా, విశాఖ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. లోకేశ్వరరావు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు ఆలయాల్లో హుండీలు చోరీ

ఎస్.రాయవరం: తిమ్మాపురంలో రెండు దేవాలయాల్లో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. చెరువు గట్టుపై శివాలయం, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో హుండీలు బద్దలుగొట్టి నగదు ఎత్తుకుపోయారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలోని కామాక్షమ్మ మెడలో శతమానాలు అపహరించుకుపోయారు. తుప్పల్లో హుండీలు పడేసి వెళ్లిపోయారు. శనివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించింది. శివాలయం హుండీలో రూ.10 వేలు, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో రూ. 15 వేలు చోరీ అయినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సాక్షి పాడేరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా పాడేరు పట్టణంలోని అంధకారం నెలకొంది. సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ సరఫరా విభాగంలోని టీసీ వ్యవస్థ పాడవడంతో సాయంత్రం 4 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పాడేరు పట్టణ పరిధిలోని అన్నివీధుల్లోను విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు శ్రమించి విద్యుత్ సరఫరాను రాత్రి 9.30 గంటల సమయంలో పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో వేచలం విద్యార్థికి రజతం



విద్యార్థి గణేష్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వేచలం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి దమ్ము గణేష్ సత్తా చాటాడు. గత నెల ఏలూరులో అంతర జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–14 లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచాడు. విద్యార్థి, పీడీ తమ్మునాయుడులను హెచ్ఎం దేవులపల్లి నర్సింహమూర్తి, సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు, ఎంపీటీసీ రెడ్డి శ్రీలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రెడ్డి శ్రీనివాస్, ఎంపీపీ స్కూల్ చైర్మన్ వేచలపు పరమేష్ అభినందించారు.

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవోలు

సాక్షి,పాడేరు: భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని శుక్రవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు.

విభజన చట్టంలోని హామీల అమలుకు ఐక్య ఉద్యమం

మావోయిస్టు పార్టీ ఆంధ్ర–ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పిలుపు



భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

ఆంధ్ర–ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ

మావోయిస్టుల కరపత్రాలు

జి.మాడుగుల: రాష్ట్ర విభజన చట్టంలోని హామీల అమలుకు అన్ని ప్రాంతాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆంధ్ర–ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పిలుపునిచ్చారు. స్థానిక విలేకర్లకు శుక్రవారం మావోయిస్టు పార్టీ నుంచి ప్రకటన అందింది. రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదిన్నర సంవత్సరాలు గడిచిపోయిందని, పార్లమెంట్ సాక్షిగా 2013 రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన హామీల్లో మెజారిటీ నేటికీ అమలుకు నోచుకోలేదని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. విడిపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని నిర్మాణం.. రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి, తుంగభద్ర నదీ జలాల పంపిణీ.. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి కేంద్రమే నిర్మించడం.. వెనుకబడి ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీని కేటాయించటం.. విద్య వైద్య రంగాలను అభివృద్ధి పరచడం.. ఉపాధి కల్పన, ఆస్తులు, అప్పుల పంపిణీ, విద్యుత్, రోడ్డు నిర్మాణం తదితర అంశాలను రాబోయే 10 సంవత్సరాల్లో పూర్తి చేయాలని గణేష్ డిమాండ్ చేశారు. రాజధాని పేరులో ప్రజల నిజమైన సమస్యల నుంచి పక్కదారి పట్టిస్తూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజల మధ్య వైషమ్యాలను సృష్టిస్తున్న పాలకవర్గాల కుట్రలను తిప్పికొటాలని కోరారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లతో సాంకేతిక పరిజ్ఞానం

కలెక్టర్ సుమిత్‌కుమార్



నమునాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి, పాడేరు: అటల్ టింకరింగ్ ల్యాబ్‌లతో విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించవచ్చని కలెక్టర్ సుమీత్‌కుమార్ అన్నారు. స్థానిక తలారిసింగి జీటీడబ్ల్యూ సీహెచ్ బాలురు పాఠశాలలో శుక్రవారం అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఐటీడీఏ పీవో గోపాలకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిదశనుంచే నూతన నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని కోరారు. ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ మాట్లాడుతూ చిన్నవయసు నుంచి పిల్లలకు వినూత్న ఆలోచనలతో టెక్నాలజీలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీడీ కొండలరావు, డీఈవో రమేష్, ఏటీడబ్ల్యూవో రజిని పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయ సందర్శన



స్వామివారిని దర్శించుకుంటున్న అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్

వీఆర్ పురం: శ్రీరామగిరి కొండపై కొలువు దీరిన సుందర సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలవరం ప్రాజెక్ట్ ముంపుతో ఆలయానికి ఎదురయ్యే పరిస్థితులపై చర్చించారు. ఆలయ సిబ్బంది పెండింగ్ వేతనాలను చెల్లించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మీకుమార్, ఆలయ చైర్మన్ రేవు బాలరాజు, సిబ్బంది సాయిబాబు, కొండయ్య పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం



అన్నదానంలో దివ్యాంగ విద్యార్థులు

వై.రామవరం: వై.రామవరం గ్రామానికి చెందిన 108 ఈఎమ్‌టీ పరపతి శ్రీనివాసరావు, వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో శుక్రవారం సుమారు 70 మంది దివ్యాంగ విద్యార్థుకు అన్నదానం చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న జియోన్ ఎడ్యుకేషనల్ సొసైటీ(దివ్యాంగుల శరణాలయం)లోని సుమారు 70మంది దివ్యాంగ విద్యార్థులకు ఒకపూట భోజనాన్ని సమకూర్చారు. కరస్పాండెంటు రాజు, అలియాస్ బెన్నీతో పాటు దివ్యాంగ విద్యార్థులు ఆ కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాజమహేంద్రవరం 108 సిబ్బంది కూడా పాల్గొన్నట్టు ఈఎమ్‌టీ శ్రీనివాసరావు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు గురుకుల విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

దేవరాపల్లి: తెనుగుపూడిలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రనాథ్ తెలిపారు. విశాఖపట్నంలోని డాక్టర్ బుల్లయ్య జూనియర్ కళాశాలలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో విశేష ప్రతిభ చాటారన్నారు. అండర్–19 హ్యాండ్‌బాల్‌కు పి. గోపిచంధ్, వెయిట్ లిఫ్టింగ్‌లో బి. శ్యామ్, పి. దినేష్, పవర్ లిఫ్టింగ్‌లో ఎస్. ఆనంద్, యోగాలో శివ మహేష్, హేమంత్ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. 2022–2023 విద్యా సంవత్సరంలో కళాశాల నుంచి వివిధ క్రీడలకు 16 మంది ఎంపికయ్యారని వివరించారు. వీరితోపాటు పీడీ బి. రాంబాబును విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా గురుకులాల కోఆర్డినేటర్ ఎస్. రూపావతి, ప్రిన్సిపాల్ అభినందించారు.